క్లుప్తంగా

సీతారాముల ఆలయానికి పల్లకీ కానుక



వానరసేన సభ్యులకు, దాతలు జగ్‌మోహన్ త్రిసంధ్య అందించిన పల్లకి

పాయకరావుపేట : పట్టణంలో గల సీతారాముల ఆలయానికి పల్లకీ కానుకగా దాతలు అందించారు. పట్టణానికి చెందిన కీ.శే.కొణిరెడ్డి నూకరాజు జ్ఞాపకార్థం ఆయన మనవరాలు గెద్దమూరి జగ్‌మోహన్ త్రిసంధ్య దంపతులు పల్లకీని తయారు చేయించి ఆలయానికి అందించారు. సీతారాముల తిరువీధి ఉత్సవ విగ్రహాల ఊరేగింపునకు, సీతారాముల కల్యాణానికి ఉపయోగపడేందుకు కానుకగా ఇచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ, వానరసేన సభ్యులకు మంగళవారం ఆలయంలో పల్లకీని సమర్పించారు.

మొక్కుబడిగా మండల సమావేశం



మండల సర్వసభ్య సమావేశం

పాయకరావుపేట : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు ఇసరపు పార్వతీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నికల కోడ్, ఎన్నికల సందర్భంగా నామ మాత్రంగానే సభ జరిగింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జెడ్పీటీసీ లంక సూరిబాబు అధికారులను కోరారు. ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ వర్మరాజు సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు సమస్యల పరిష్కారాల పై వివరించారు.

పూరిల్లు దగ్ధం



బాధితురాలు వెంకయ్యమ్మ

రాంబిల్లి : వెంకటాపురంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమైంది. సోమవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.5 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితురాలు కె.వెంకయ్యమ్మ ఆవేదన చెందారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

వడగాలులకు ఉక్కిరిబిక్కిరి



అడ్డురోడ్డు శివారు నిర్మానుష్యంగా మారిన జాతీయ రహదారి

ఎస్.రాయవరం : మండలంలో మంగళవారం తీవ్రమైన వేడిగాలులతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఉదయం 9 గంటలకు ఎండ తీవ్రత పెరిగి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. 37 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం వేడిమికి ఇబ్బందులు పడ్డారు. రాత్రి 8 గంటల వరకు వేడి తీవ్రత తగ్గలేదు.

మునగపాక ఎస్ఐ ప్రసాదరావుకు ప్రశంస



మునగపాక ఎస్ఐ ప్రసాదరావుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

మునగపాక : మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావుకు అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ నుంచి ప్రశంసలు అందాయి. మద్యం అక్రమ సరఫరాకు సంబంధించిన కేసు విషయంలో ఎస్ఐ ప్రసాదరావు ఇటీవల తన సిబ్బందితో చేసిన టాస్క్ విజయవంతం కావడంతో అతని సేవలను గుర్తించిన ఎస్పీ మురళీకృష్ణ మంగళవారం ప్రశంసాపత్రం అందజేశారు. గోవాకు సంబంధించిన మద్యం ఏపీలోని యలమంచిలి మండలం సోమలింగపాలెం వద్ద డంప్ చేసిన విషయాన్ని గుర్తించి కేసుతో సంబంధం ఉన్న వారిని పట్టుకోవడంలో ప్రసాదరావు కృషిని అభినందించారు.

లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లు

- దళితవాడల్లో దద్దరిల్లిన ప్రచారం
- దూసుకు పోతున్న వైఎస్సార్‌సీపీ
- గ్రామాల్లో విశేష ఆదరణ



కొబ్బరి చీపుర్ల కార్మికురాలి కష్టాలు తెలుసుకుంటున్న అభ్యర్థి జోగులు



ఇందిరా కాలనీలో ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు ప్రచారం



అభ్యర్థి కంబాల జోగులుకు హారతి ఇస్తున్న రాష్ట్ర లిడ్‌క్యాప్ డైరెక్టర్ వేమగిరి కల్యాణి



ప్రచారంలో డప్పు వాయిస్తున్న అభ్యర్థి కంబాల జోగులు

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నికల ప్రచారపర్వంలో వైఎస్సార్‌సీపీకి లబ్ధిదారులే స్టార్ క్యాంపెయినర్లుగా మారుతున్నారు. జగనన్న ప్రభుత్వం వల్ల లబ్ధి పొందిన వారు, ఆయనను విపరీతంగా అభిమానించే వారు ఈ దఫా ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉంటూ ప్రచారంలో మంచి ఉత్సాహం తీసుకు వస్తున్నారు. నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు, పవర్‌స్టార్‌గా చెప్పుకునే పవన్‌కల్యాణ్ వారి ప్రచారంలో సినిమా స్టార్లను, జబర్దస్త్ ఫేంలను ప్రచారానికి రప్పిస్తుండగా వైఎస్సార్‌సీపీ మాత్రం ప్రజలు, ప్రభుత్వం వల్ల లబ్ధి పొందిన వారే తమ ప్రచారానికి స్టార్ క్యాంపెయినర్లని పేర్కొంది. అభ్యర్థి కంబాల జోగులు తమ ప్రాంతాల్లో ప్రచారానికి వచ్చినపుడు అభిమానులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తమదైన శైలిలో ప్రచారానికి ఊపు తెస్తున్నారు. పార్టీల కతీతంగా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంతో గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన అభ్యర్థి కంబాల జోగులుతో పాటు, ఇతర నాయకులను ప్రజలు ఆదరిస్తున్నారు. ఏ ఇంటికి వెళ్లి ఫలానా పథకం వల్ల మాకు లబ్ధి కలిగిందనే చెప్పడం విశేషం. ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు సైతం అయిష్టంగానైనా జగనన్న ప్రభుత్వం వల్ల కలిగిన లబ్ధిని చెప్పక తప్పడం లేదు. పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కంబాల జోగులు నియోజకవర్గానికి కొత్త వ్యక్తి అయినప్పటికీ ప్రచారం దూసుకుపోతున్నారు. షెడ్యూలు వెలువడిన తర్వాత ఆయన ప్రచారంలో దూకుడు పెంచారు. ఇప్పటి వరకు ఎస్.రాయవరం మండలంలో 12 గ్రామాల్లోను, నక్కపల్లి మండలంలో 10 గ్రామాల్లోను పాయకరావుపేట మండలంలో ఆరు గ్రామాల్లోను, కోటవురట్ల మండలంలో 8 గ్రామాల్లోను ఎన్నికల ప్రచారం పూర్తి చేశారు. ముఖ్యంగా దళిత వాడల్లోను బీసీ, ఎస్సీ కాలనీల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలకడంతో పాటు వయోభేదం లేకుండా వృద్ధులు, యువకులు దళిత సోదరులు, తీన్మార్ డాన్సులు, డప్పు వాయిద్యాలు తప్పెట గుళ్లతో స్వాగతం పలుకుతూ ప్రచారంలో తమదైన శైలిలో పాల్గొంటున్నారు. ఇటీవల గొడిచర్లలో ముగ్గురు వృద్ధులు జగన్‌బాబుకే మా ఓటు అంటూ ఒంట్లో ఓపిక లేకపోయినా సత్తువను కూడ దీసుకుని మండు టెండను సయితం లెక్క చేయకుండా తీన్మార్ డప్పులతో నృత్యాలు చేస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. తాజాగా పాయకరావుపేటలో దళితవాడలో మంగళవారం జరిగిన ప్రచారంలో అభ్యర్థి కంబాల జోగులు డప్పు వాయిస్తూ ప్రచారం చేస్తున్న సమయంలో దళిత నాయకుడు నెలపర్తి అర్జున్‌తోపాటు మరికొంతమంది హుషారుగా నృత్యాలు చేశారు. మహిళలు, చేతి వృత్తులవారు, వివిధ స్వయం ఉపాధి పనులు చేసుకునే వారు, రిక్షా , మత్స్యకార మహిళలు, ఆటో కార్మికులు, డప్పు కళాకారులు, ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటూ కంబాల జోగులు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

హోరెత్తిన ప్రచారం

పాయకరావుపేట : పట్టణంలో గల ఇందిరాకాలనీ, అంబేడ్కర్ కాలనీ, రాజీవ్ నగర్ కాలనీల్లో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుకు ప్రతి ఇంటి వద్ద మహిళలు హారతులు ఇచ్చి, స్వాగత నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా అభ్యర్థి కంబాల జోగులు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారం సాగించారు. మే 13న జరుగబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు పాల్గొని ప్రచారం సాగించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కంబాల జోగులును, ఎంపీగా బూడి ముత్యాల నాయుడుని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో ఇందిరాకాలనీ వద్ద, రాజీవ్ కాలనీ వద్ద డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓటర్లకు ప్రచార బ్రోచర్లను అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జెడ్పీటీసీ సూరిబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నానాజీ, దళిత నాయకులు నెలపర్తి అర్జున్, ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, నాయకులు ధనిశెట్టి మహేష్, పిరాధి రాజు, పంచాయతీ వార్డు సభ్యులు జగతా శ్రీను, సతీష్, సన్యాసిరావు, సోషల్ మీడియా ప్రతినిధి కొంకిపూడి రామకృష్ణ, నాయకులు సత్తిబాబు, నాగరాజు, తాతారావు, మహిళా విభాగం బొడ్డా శ్రీదేవి, సీతారత్నం, కొంతం వరలక్ష్మి, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ దోమాడ సుందర్రావు ప్రచారంలో పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

మునగపాక : వైఎస్సార్‌సీపీ మునగపాక పంచాయతీ పరిధిలోని కార్యకర్తల సమావేశం బుధవారం జరుగుతుందని గ్రామశాఖ అధ్యక్షుడు బొడ్డేడ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో రాత్రి 7 గంటలకు జరిగే సమావేశానికి కార్యకర్తలు హాజరుకావాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు.

నాటకోత్సవాల నిర్వహణపై దృష్టి



మాట్లాడుతున్న గ్రామీణ యువజన సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు రాము

మునగపాక : మునగపాకలో నాటకోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము తెలిపారు. మునగపాక పీఏసీఎస్ ఆవరణలో కళాకారులతో ఆయన మాట్లాడారు. తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా విరేశలింగం పంతులు నాటక రంగానికి అందించిన సేవలను కొనియాడారు. అందరి సలహాలు, సూచనల మేరకు నాటకోత్సవాల నిర్వహణపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామీణ యువజన మందిరం మాజీ అధ్యక్షుడు టెక్కలి కొండలరావు, కార్యదర్శి ఆడారి సోమశేఖర్, యువ రచయిత విల్లూరి జగ్గప్పారావు, కళాకారులు వెంకట్, రాము పాల్గొన్నారు.

ప్రతి గడపలోనూ జగన్ నామస్మరణే



తిమ్మాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బొలిశెట్టి శారదాకుమారి

ఎస్.రాయవరం : ప్రతి గడప వద్ద జగన్ నినాదం వినిపిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల మహిళా నాయకులు, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదా కుమారి అన్నారు. తిమ్మాపురం గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. మాకు డ్వాక్రా రుణం మాఫీ చేసి, చేయూత , అమ్మఒడి వంటి పథకాలు అందించారని, జగన్‌కే తమ ఓటు అంటూ మహిళలంతా స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి సత్యనారాయణ, ఎంపీటీసీ బొండా వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొండా దివాణం, శ్రీనివాసరావు, మందగుదుల వెంకటరమణ, గంగాబ్బాయి, జగదీష్, రాము పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక : రానున్న ఎన్నికల్లో యలమంచిలిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు కోరారు. ఇందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. మునగపాకలో మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసేలా ప్రచారం నిర్వహించాలన్నారు. చంద్రబాబు అండ్‌కో మోసాలు, కుతంత్రాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈనెల 19న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు యలమంచిలిలో నామినేషన్ వేస్తున్నారని పెద్దసంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహా, పార్టీ మహిళా విభాగం మండల కన్వీనర్ శీరా రమణమ్మ పాల్గొన్నారు.

ఈవీఎంలకు పటిష్ట భద్రత



యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్ట్రాంగ్ రూం వద్ద సాయుధ బలగాల కాపలా

యలమంచిలి రూరల్ : యలమంచిలి నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలు భద్రపరిచిన తాత్కాలిక స్ట్రాంగ్‌రూం వద్ద గట్టి పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. అధికారులు, జిల్లా సెంట్రలైజ్డ్ గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి చేసి, రెండ్రోజుల క్రితం యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడో అంతస్తులో భద్రపరిచారు. నియోజకవర్గంలో 246 పోలింగ్ కేంద్రాలుండగా మే13న జరగనున్న పోలింగ్ కోసం రిజర్వు యంత్రాలతో కలిపి 295 కంట్రోల్, 295 బ్యాలెట్ యూనిట్లు, 319 వీవీ ప్యాట్ యంత్రాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీలు వేసి భద్రపరిచారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూం వద్ద నిరంతరం సాయుధ పోలీసులను కాపలా ఉంచారు. వీరితో పాటు విపత్తుల నిర్వహణ శాఖ, సాధారణ పోలీసు శాఖల సిబ్బందిని కూడా బందోబస్తులో ముందు జాగ్రత్తగా ఉంచారు.

చంద్రబాబూ విషం కక్కావ్..ఇక కాచుకో!



రాజీనామా చేసి సమావేశానికి హాజరైన వలంటీర్లు



వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ చైర్మన్ సూర్యనారాయణరాజు

కోటవురట్ల : అయ్యా చంద్రబాబూ మా వలంటీర్లపై విషం కక్కావు..నిందలు మోపావు..అవేం ఉద్యోగాలు గోనె సంచెలు మోసే ఉద్యోగమా అన్నావు.. అన్నీ భరించాం..ఎవరూ లేని సమయంలో ఇళ్లకు వెళ్లి తలుపు కొడుతున్నామని, వారి సమాచారం అంతా అంతర్రాష్ట్ర ముఠాలకు అమ్మేస్తున్నామని ఘోరంగా అవమానించావు..అవ్వాతాతలకు పింఛను ఇవ్వకుండా అడ్డుపడ్డావు..మళ్లీ వలంటీరు వ్యవస్థను తీసేయను అంటావ్..వలంటీర్లకు రూ.పదివేలు ఇస్తానంటావ్. నీ నోటికి హద్దు లేదు...ఎంత అవమానించినా ఇప్పటి వరకు భరించాం. ఇకపై మేము స్వేచ్ఛాపరులం. మేమేంటో నీకు చూపిస్తాం. మళ్లీ జగనన్న ప్రభుత్వమే వస్తుందంటూ మాజీ వలంటీర్లు తమ ఆగ్రహావేశాలను వ్యక్తపరిచారు. తంగేడులో తమ పదవులకు రాజీనామా చేసిన వలంటీర్లు అందరితో మంగళవారం సమావేశం నిర్వహించారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ పై విధంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాయకరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించి చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మళ్లీ రెండు ఓట్లు వైఎస్సార్‌సీపీకి ఫ్యాను గుర్తుపై వేసి జగన్ ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి. సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏ ఆశయంతో వలంటీరు వ్యవస్థను తీసుకొచ్చారో అంతకు మించి వలంటీర్లు తమ సేవా గుణాన్ని చాటారని కొనియాడారు. కోవిడ్ సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ హైదరాబాద్‌లో ఇళ్లల్లో దాక్కుంటే వలంటీర్లు మాత్రం ప్రాణాలను పణంగా పెట్టి ఎన్నో ప్రాణాలను కాపాడారని మానవత్వం అంటే ఏంటో ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. వలంటీర్లకు ఎవరూ సాటి రారని, రాజీనామా చేశారు కాబట్టి స్వేచ్ఛగా మళ్లీ జగన్ సంక్షేమ ప్రభుత్వాన్ని తెచ్చుకోవడానికి ఉద్యమంలా పనిచేయాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్.ఎస్.రామచంద్రరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యల్లపు కుమారరాజా మాట్లాడుతూ వలంటీర్లు మహాశక్తిగా అభివర్ణించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పెద సీతాబాబు, సిద్ధాబత్తుల సత్యనారాయణ, ఆర్.ఎస్ సత్యనారాయణరాజు, ఆర్.ఎస్ లక్ష్మీనరసింహరాజు, శింగంపల్లి కిషోర్, రాజులనాయుడు, జిల్లా యువజన విభాగం కార్యదర్శి చామంతుల శ్రీనివాసు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం కావాలి



మూలపేటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు



గొల్లలపాలెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న మహిళా విభాగం మండల కన్వీనర్ రమణమ్మ

మునగపాక : వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు,వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండల కన్వీనర్ శీరా రమణమ్మలు కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యూవీ రమణమూర్తిరాజుల విజయం కోరుతూ మూలపేట,గొల్లలపాలెం గ్రామంలో ఇంటింటా ప్రచారాలు నిర్వహించారు. గత ఐదేళ్ల కాలంలో జరిగిన మేలును గుర్తుంచుకొని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మద్దతు అందించాలన్నారు.

9 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

పాయకరావుపేట : సత్యవరం గ్రామ రెండో సచివాలయానికి చెందిన 9 మంది గ్రామ వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వీరందరూ విడివిడిగా రాజీనామా పత్రాలను రాసి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.స్వప్నకు అందించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ తమ విధులకు ఆటంకం కల్పించినందుకు తామందరం రాజీనామాలు చేసినట్టు తెలిపారు. త్వరలో జరుగనున్న ఎన్నికల్లో తామందరం వైఎస్సార్‌సీపీకి కష్ట పడి పనిచేసి మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మరలా వలంటీర్లను కొనసాగించేందుకు తొలి సంతకం చేస్తానని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడం ఎంతో అభినందనీయమన్నారు.

సీతారాముల కల్యాణం నేడు



దిమిలిలో సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి



నవమి వేడుకలకు ముస్తాబైన తిమ్మాపురం రామాలయం

రాంబిల్లి: మండలంలో పలు గ్రామాల్లో బుధవారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు రామాలయాలను అందంగా ముస్తాబు చేశారు. ఇప్పటికే పెళ్లిరాట వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణోత్సవం భాగంగా అన్న సమారాధనలకు ఏర్పాట్లు చేశారు. రాంబిల్లి రామాలయంలో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కన్నబాబు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ పాల్గొననున్నారు.

పాయకరావుపేట : శ్రీ రామనవమి సందర్భంగా బుధవారం జరగబోయే సీతారాముల కల్యాణానికి మండలంలో రామాలయాలు ముస్తాబయ్యాయి. రామాలయాల వద్ద చలువ పందిళ్లు వేశారు. ఆయా గ్రామాల్లో గల రామాలయాల అభివృద్ధి కమిటీలు, భక్తులు, రామాలయాలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాములను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.

ఎస్.రాయవరం : గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు పురస్కరించుకుని రామాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల్లో దంపతుల సమేతంగా కూర్చుని పట్టాభి రామునికి కల్యాణం జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయాల ముందు చలువ పందిళ్లు, పెళ్లిరాటలు వేసి, రామాలయాలు ముస్తాబు చేశారు. అలాగే పలు గ్రామల్లో అన్న సమారాధనలకు ఏర్పాట్లు చేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



కొక్కిరాపల్లి గురుకులంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ రాంబాబు



అగ్నిమాపక శకటం నుంచి నీటి గొట్టాల ద్వారా మంటలు అదుపు చేసే విన్యాసం

యలమంచిలి రూరల్ : జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కొక్కిరాపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో మంగళవారం విద్యార్థినులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో, నివాసగృహాల్లో,వాణిజ్య సముదాయాల్లో, ఆస్పత్రుల్లో బహుళ అంతస్తుల భవనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను యలమంచిలి అగ్నిమాపక కేంద్రం అధికారి డి.రాంబాబు వివరించారు. అగ్ని ప్రమాదాల్లో మృతి చెందిన వారి జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వ తేదీ వరకు జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆయన విద్యార్థినులకు వివరించారు. ప్రమాదాలు జరిగినపుడు అందుబాటులో ఉన్న కార్బన్ డై ఆక్సైడ్ సిలిండర్లను ఎలా ఉపయోగించాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అగ్నిమాపక శకటం నుంచి నీటిని వినియోగించి మంటలను ఎలా అదుపు చేస్తారో చేసి చూపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మళ్ల మాణిక్యం పాల్గొన్నారు.

అత్యవసర ఫోన్ నంబర్లపై అవగాహన

చోడవరం రూరల్: ప్రతి విద్యార్థి భద్రత, విపత్తులకు సంబంధించిన అత్యవసర సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లు తెలుసుకుని ఉండాలని ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు చోడవరం అగ్నిమాపకదళ సిబ్బందితో అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ బి.వి.రామస్వామి మాట్లాడుతూ 100, 101, 102, 104, 108 నంబర్ల ద్వారా కలిగే సహాయం గురించి తెలిసి ఉండాలన్నారు.

న్యాయమూర్తి గంగరాజుకు ఘన సన్మానం



సమావేశంలో

అనకాపల్లి: న్యాయమూర్తి గంగరాజు విశేష సేవలందించారని పలువురు న్యాయవాదులు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి గంగ రాజుకు అనకాపల్లి నుంచి నర్సాపురం బదిలీ అయిన సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గంగరాజు పారదర్శకమైన సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప, రెండో తరగతి జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, అధ్యక్షులు సాయిలక్ష్మణ్, సెక్రటరీ సూరా శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు సూరా భాస్కరరావు, మజ్జి శ్రీనివాసరావు, జగన్నాథరాజు, కె.పి.వి.రమణయ్య, అడపా సుధాకర్, రాజశేఖర్, బార్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు శ్రీనివాసరావు, జగపతి,సాయిరాం, రామచంద్రరావు,కిషోర్, కుసుమ, లీల తదితరులు పాల్గొన్నారు.